క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సిడాం దత్తు

చెన్నూర్: శిక్షణ పొందిన అధికారులు ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని చెన్నూర్ ఎన్నికల అధికారి సిడాం దత్తు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎన్నికల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ యంత్రాల పనితీరు సంపూర్ణ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చంద్రశేఖర్, విశ్వంబర్, మల్లికార్జున్, మాస్టర్ ట్రైనర్స్ గుండెటి యోగేశ్వర్, ఎస్.శ్రీనివాస్, దత్తమూర్తి, కృష్ణమూర్తి, నరేందర్, శ్రీనివాస్, శ్రీమూర్తి, షారీక్, నారాయణ, సురేందర్ పాల్గొన్నారు.

రూ.2.50లక్షల విరాళం



ఉపాధ్యాయులతో వేణుగోపాల్

జన్నారం: తాను చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలని భావించిన పూర్వ విద్యార్థి పాఠశాల వంటశాలకు, స్టేజీ కోసం రూ.2.50లక్షలు విరాళంగా అందజేసి ఉదారత చాటాడు. జన్నారం మండలం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1992–93బ్యాచ్‌లో పదో తరగతి చదివిన మల్యాల బాపన్న, వసంతల కుమారుడు వేణుగోపాల్ ఉద్యోగ రిత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. సొంత గ్రామానికి వచ్చిన ఆయన బుధవారం పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో వంటగది, స్టేజీ లేకపోవడంతో వాటి నిర్మాణానికి తాను విరాళం అందజేస్తున్నట్లు ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జక్కు భూమేశ్, ఉపాధ్యాయులు వేణుగోపాల్‌ను అభినందించారు.

పల్లెదవాఖానకు సుస్తీ..!



వీగాంలో శిథిలావస్థలో పల్లెదవాఖాన

భీమిని: మండలంలోని వీగాం గ్రామపంచాయతీలో పల్లెదవాఖాన (ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం) శిథిలావస్థకు చేరింది. సిబ్బంది సైతం ఉండలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అన్ని రకాల వైద్యసదుపాయాలను అందించడానికి ఒక డాక్టర్‌తో కూడిన పల్లెదవాఖానాను ఏర్పాటు చేశారు. కానీ ఆచరణలో మాత్రం ఇందుకు భిన్నంగా మారాయి. గ్రామస్తులు అనారోగ్య సమస్యతో వెళ్తే పల్లెదవాఖానాలో సిబ్బంది ఎవరూ ఉండటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి పల్లెదవాఖానాను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆరు గ్యారంటీలతో ప్రజలకు మేలు

- మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు



ప్రేంసాగర్‌రావు, సురేఖను సన్మానిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీలతో ఈ ఎన్నికల్లో మీ ముందుకు వస్తోందని, ఈ ఆరు గ్యారంటీ హామీలతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ పెద్దమ్మగుడి వద్ద కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకాగా, కాంగ్రెస్ పార్టీని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేలా తాను కృషి చేస్తానన్నారు. పింఛన్ల పెంపుతో పాటు, గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే ఇస్తామని, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. తాను చదువుకున్న ఈ ప్రాంతంలో ఇప్పటికీ ఉన్నత చదువులను చదివేందుకు విద్యార్థులకు అవకాశం లేదని, నా ప్రాంతానికి అవసరమైనటువంటి అన్ని వసతులను కల్పించడమే నా ధ్యేయమని స్పష్టం చేశారు. విద్యతో పాటు, వైద్యం అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తీసుకొచ్చి, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానన్నారు. తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే, ఇచ్చిన ప్రతి హామీలన్నింటిని తీరుస్తానని, ఒకసారి తనకు అవకాశం కల్పించాలని కోరారు.



జెండావెంకటాపూర్‌లో ప్రచారం

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్, బలరావుపేట, రంగపేట, తిమ్మాపూర్ పోతపల్లి, అంకతిపల్లి, చందారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్ రావు బుధవారం ప్రచారం చేపట్టారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పింగిలి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బెల్లంపల్లిరూరల్: రైతులు వరిధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని, ఐకేపీ ద్వారా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకుని మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం శ్యామల, మండల వ్యవసాయాధికారి వందన అన్నారు. బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు కొనుగోలు కేంద్రాల్లోనే మంచి గిట్టుబాటు ధర అందుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నాగదీప్తి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఐకేపీ సీసీ సుందరేష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, వీవోఏలు వెంకటస్వామి, శ్రీవేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌కు ఓటమి భయం

- చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్



మాట్లాడుతున్న బాల్క సుమన్, భానుప్రసాద్

మంచిర్యాలటౌన్: చెన్నూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వివేక్ వెంకటస్వామికి ఓటమి భయం పట్టుకుందని, దీంతో సీఎం కేసీఆర్‌పై, తనపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని దివాకర్‌రావు నివాసంలో బుధవారం ఎమ్మెల్సీ భానుప్రసాద్‌తో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వివేక్ సూట్‌కేసుల్లో డబ్బులను తెచ్చి ఈ ప్రాంతంలోని నాయకులను కొనేందుకు ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే గోదావరిఖనిలోని వివేక్ ఇంటి అడ్రస్ పేరిట ఉన్న షెల్ కంపెనీకి రూ.8కోట్లు విశాఖ ఇండస్ట్రీస్ నుంచి రాలేదా అని ప్రశ్నించారు. దీనిని గుర్తించిన ఐటీ, ఈడీ అధికారులు వివేక్ ఇంట్లో సోదాలు చేస్తే తనకేంటి సంబంధమని, అవి రెండూ కూడా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నాయకులపైనా ఐటీ దాడులు జరుగుతుండగా, వాటిని కూడా తానే చేయిస్తున్నానా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో అడ్డూ అదుపు లేకుండా డబ్బు సంచులు, నోట్ల కట్టలతో తమ లీడర్లను వి చ్చలవిడిగా కొనుగోలు చేస్తున్నారని, వచ్చే రెండు రోజుల్లోగా వివేక్ కొనుగోలు చేసిన లీడర్ల వ్యవహారాన్ని ప్రజాక్షేత్రంలో లిస్టుతో సహా పెడతామన్నారు.

మైనార్టీలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- హోంమంత్రి మహమూద్ అలీ



ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలోని మైనార్టీలకు ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలిచి, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేసిందని, మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ముస్లింల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనారిటీల కోసం మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొచ్చిందని, షాదీముబారక్, మైనారిటీ బందు వంటివి ఎన్నో ప్రవేశపెట్టిందన్నారు. నేడు వేలాది మంది ముస్లింలు ఉన్నత చదువులు చదువుతున్నారని, ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ వంటి చదువులతో ముందుకు వెళ్తున్నారంటే దానికి కారణం బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు ముస్లింలకు తీరని అన్యాయం చేశాయని, కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని, మతతత్వ పార్టీలను నమ్మి మోసపోవద్దని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను సీఎం కేసీఆర్ అందిస్తున్నారని అన్నారు. ఏ మతం వారి పండుగలైనా ప్రభుత్వం చేయూతను అందిస్తుందని, ఇది కేవలం బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ భానుప్రసాద్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జలీల్, నాయకులు పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటేయండి

దండేపల్లి: కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరుతూ దండేపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆసరా పింఛన్‌దారులను కలిసి బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఉపసర్పంచ్ భూమన్న, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యం, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్



జన్నారం: ప్రచారం చేస్తున్న జాన్సన్‌నాయక్

జన్నారం: ప్రజల్లో ఉంటూ ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి, మొర్రి గూడ, టీజీపల్లి, కొత్తూరుపల్లి, చర్లపల్లి, కిష్టాపూర్, దేవునిగూడ, కామన్‌పల్లి, కవ్వాల్, కొత్తపేట, హాస్టల్‌తండా, బంగారుతండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ చంద్రశేఖర్, రాజ రాంరెడ్డి, జనార్దన్, మున్వర్ అలీఖాన్, ఫజల్‌ఖాన్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: విద్యావంతుడైన భుక్య జాన్సన్‌నాయక్‌ను ప్రజలు ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ అన్నారు. బుధవారం పట్టణంలోని జాన్సన్ నాయక్ క్యాంపు కార్యాలయంలో ఎన్నారైలతో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విజన్ ఉన్న జాన్సన్‌నాయక్ గెలిస్తేనే నియోజకవర్గం రూపురేఖలు మారుస్తాడన్నారు. ఎన్నారైలు షేక్ అహ్మద్, అశోక్‌గౌడ్, రత్నాకర్, రాకేశ్, దొనికెని నర్సయ్య, సతీశ్, మధు, రాజ్‌కుమార్, మారుతి, తేజ, ప్రవీణ్, సుభాష్ పాల్గొన్నారు.

ఖానాపూర్: ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని బుధవారం పట్టణంలోని రెండో వార్డులో, షాపింగ్‌మాళ్లకు వెళ్లి బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మిలింద్‌నగర్, బుద్ధనగర్, భీంనగర్ కాలనీలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, షేక్ సుఫీయన్, కోవ రాజేశ్వర్, కనక హనుమంత్‌రావ్, జాదవ్ లఖన్, ఆరెల్లి రాందాస్, విజయ్‌కుమార్, జాదవ్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్‌కేపీలో బీజేపీ మోటార్ సైకిల్ ర్యాలీ



రామకృష్ణాపూర్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి అశోక్

రామకృష్ణాపూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బీజేపీ నాయకులు పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి దుర్గం అశోక్ మాట్లాడుతూ.. అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. గతంలో కాంగ్రెస్‌పాలనతో, ఈ పదేళ్లలో బీఆర్‌ఎస్ పాలనతో విసిగిపోయారని, ప్రజలు ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ పనిచేస్తుందని అన్నారు.

బీజేపీ అభ్యర్థికి మద్దతుగా జనసేన బైక్‌ర్యాలీ

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్‌కు జనసేన పూర్తి మద్దతు తెలియజేస్తుందని, జనసేన శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జి సైదల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్‌తో కలిసి బుధవారం మందమర్రి పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని పలు వీధుల గుండా సాగింది. అనంతరం స్థానిక బీఎమ్మెస్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే పేద ప్రజల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న బీజేపీని గెలిపించాలని కోరారు. చెన్నూర్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల తరుపున పోటీలో ఉన్న వారు స్థానికేతరులని, వారిని గెలిపిస్తే స్థానికంగా ఉండరని ప్రజల సమస్యలు పట్టించుకోరని వివరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, పిట్టల సుదాకర్, ఆవుల సాగర్, వడ్లకొండ జీవన్‌కుమార్, విజయ్, చరణ్, కిరణ్, ప్రణయ్, బీజేపీ, బీఎమ్మెస్ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

ఆటలు ఆడేదెలా..!

- బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణం



దండేపల్లి: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ప్రభుత్వం గ్రామగ్రామాన క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. క్రీడా ప్రాంగణాలను చాలా చోట్ల గ్రామాలకు దూరంగా, లేదంటే అనువుగాని ప్రదేశాల్లో, మరికొన్ని చోట్ల ఏర్పాటు చేశామా అంటే చేశాం అనేలా ఓ బోర్డు ఏర్పాటు చేసి మమ అనిపించారు. దీంతో చాలా చోట్ల క్రీడా ప్రాంగణాలు ఆటలు ఆడేందుకు ఏ మాత్రం అనువుగా లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. మండలంలోని ఊట్ల గిరిజన గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని స్థానిక ప్రాథమిక పాఠశాల ఎదుట తెలంగాణ క్రీడా ప్రాంగణం అని ఓ బోర్డు ఏర్పాటు చేశారు. అంతే తప్పా అక్కడ ఆటలు ఆడేందుకు స్థలం లేనే లేదు. అధికారులు స్పందించి క్రీడాకారులకు ఉపయోగపడేలా క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అభివృద్ధి చేసే వారికే ఓటు

జన్నారం: సంవత్సరాల కాలంగా అభివృద్ధికి దూరంగా ఉన్న జన్నారం మండలాన్ని అభివృద్ధి చేసే వారికే, అభివృద్ధిపై హామీలు ఇచ్చిన వారికే తమ ఓటు వేసి గెలిపిస్తామని విద్యావంతులు, వ్యాపారులు అంటున్నారు. ఓటు హక్కు వినియోగం గురించి 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. టైగర్ జోన్ ఆంక్షలు ఎత్తివేయాలని, రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని, ఉద్యోగాలు కల్పించాలని అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

టైగర్‌జోన్ ఆంక్షలు ఎత్తివేయాలి



కవ్వాల్ టైగర్‌జోన్ ఆంక్షల వల్ల భారీ వాహనాల రాకపోకలు నిలిపివేశారు. దీంతో జన్నారంలో వ్యాపారం తగ్గింది. వ్యాపారులకు అవసరమైన సరుకులు ట్రాన్స్‌పోర్టు వాహనాల ద్వారా కావాలంటే ధర్మపురి, సారంగపూర్, కలమడుగు మీదుగా రావాల్సి వస్తుంది. దీంతో ట్రాన్స్‌పోర్టు భారం పడుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు టైగర్‌జోన్ ఆంక్షల ఎత్తివేతపై హామీ ఇస్తే వారికి ఓటు వేస్తాం.

\- ద్యావరశెట్టి శ్రీకాంత్, వ్యాపారి

డివైడర్లు ఏర్పాటు చేయాలి



నా చిన్నప్పటి నుంచి చూస్తున్న గదే రోడ్డు ఉంది. వాహనాలు అతివేగంగా రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. జన్నారం ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్ సిస్టంపై హామీ ఇస్తే వారికే ఓటు వేస్తాం.

\- సామ దేవా, వ్యాపారి

ఉద్యోగాలు కల్పించే వారికే ఓటు



ఉద్యోగాలు లేక చదువుకున్న యువకులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఉద్యోగాలు లేక కూలీలుగా మారుతున్నారు. ఉద్యోగాలు కల్పించే అభ్యర్థులకు, పార్టీకి ఈ సారి ఓటు వేస్తాం. నిజాయతీ పరులైన, మంచి అభ్యర్థులను పరిశీలించి ఓటు వేస్తాం.

\- ఎంఏ యాసీన్, నిరుద్యోగి

పోలీసుల విస్తృత తనిఖీలు

నస్పూర్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సీసీసీ నస్పూర్ పోలీసులు ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ చౌరస్తాలు, లాడ్జిలలో బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. సీసీసీ కార్నర్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. అటుగా వెళ్తున్న చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వివేక్ వాహనాన్ని సైతం ఆపి తనిఖీ చేశారు. అందులో ఎలాంటి డబ్బు, వస్తువులు లభించలేదు.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. బెల్లంపల్లి నుంచి కన్నెపల్లి మండలానికి వెళ్తుండగా పోచమ్మగడ్డ చెక్ పోస్ట్ వద్ద వినోద్ వాహనాన్ని పోలీసులు ఆపి ఎన్నికల నిబంధనల ప్రకారం తనిఖీ నిర్వహించారు. తనిఖీ సమయంలో వినోద్ పోలీసులకు సహకరించారు. తనిఖీ అనంతరం వాహనాన్ని పంపించారు.

వేమనపల్లి: ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో గ్రామాల్లో తనిఖీలు చేపడుతున్నారు. నీల్వాయి ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం నీల్వాయి, వేమనపల్లి ప్రధాన రహదారులపై వాహనాల తనిఖీ చేపట్టారు. అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు కనబడితే వారి ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులను పరిశీలించారు. పోటీ చేసే అభ్యర్థుల తరపున మందు, డబ్బు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందునా వాహనాల సోదాలు నిర్వహించారు.

కళాశాలలో ఫుడ్‌ఫెస్టివల్



విద్యార్థుల వంటకాల ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ విద్యార్థులు బుధవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. వివిధ వంటకాలతో విద్యార్థులు ప్రదర్శించారు. కళాశాల చైర్మన్ పల్లె భూమేష్ మాట్లాడు తూ.. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా లభించే ఆహార పదార్థాలను, పండ్లు కూరగాయలను తీసుకోవాలన్నారు. రసాయన మందుల్లేని ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వంటకాల ద్వారా తెలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సాత్వికమైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిత ఠాకూర్, ఫుడ్స్ సైన్స్ లెక్చరర్ శ్రావణి, రజిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రొజెక్టర్ల మరమ్మతులకు అవకాశం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని సర్కారుబడులకు పంపిణీ చేసిన కేయాన్ కంప్యూటర్ కమ్ ప్రొజెక్టర్లకు సాంకేతిక లోపంతో(టెక్నికల్ ప్రాబ్లమ్) ఇబ్బందులుంటే ఈ నెల 24న మరమ్మతు చేయనున్నట్లు సెక్టోరల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెలాఖారుకు కేయాన్ సంస్థ పంపిణీ పరికరాల ఒప్పందం ముగియనుండటంతో రిపేర్లు ఉంటే కంప్యూటర్‌తో పాటు ప్రొజెక్టర్లను డీఈవో కార్యాలయానికి తీసుకురావాలన్నారు. ఈ నెల 24న ఒక్కరోజు మాత్రమే టెక్నీషియన్ అందుబాటులో ఉంటారని సూచించారు.

'అప్రోచ్' అసంపూర్తి!



వంతెన సమీపంలో అప్రోచ్ వేయని దృశ్యం

దండేపల్లి: మండలంలోని ము త్యంపేట–రెబ్బనపల్లి గ్రామాల మధ్య ఒర్రెపై నిర్మించిన వంతెన సమీపంలో అప్రోచ్ రోడ్డును అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వంతెన సమీపంలో కంకర రాళ్లు తేలి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

వరిలో నాణ్యత ప్రమాణాలపై అవగాహన



ఆస్నాదలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు వరి పంటలో నాణ్యత ప్రమాణాల గురించి అవగాహన కల్పించారు. పంటలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. రైతులు సేంద్రీయ పద్ధతులలో పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సాగర్, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899